


# తెలిసినవాళ్ళు

విభూష్యం రాజేశ్వరరావు

"రండి!" గల్లా పెట్టె ముందు నుంచి లేచి నిలబడి తల మీది వర్లటోపీ సర్దుకుంటూ షాపులోకి ఆహ్వానించాడు సేట్ సుందర్‌లాల్. ఆ తర్వాత కారా కిళ్ళీతో గార పట్టిన పళ్ళన్నీ బయటకు పెట్టి నవ్వుతూ రెండు చేతులూ జోడించి నమస్కరించాడు.

ప్రతి నమస్కారం చేసి సీత వంక గర్వంగా చూశాను!

ఈ షాపులో నాకున్న విలువ గమనించినట్లు సీత చిరునవ్వు నవ్వింది.

"లేటెస్ట్ ఫేషన్ చీరలు మొన్ననే వచ్చాయి. పూర్ సిల్కు, గాజీ సిల్కు, కాశ్మీర్ సిల్కు... అన్ని వెరైటీలు అమ్మగార్కి చూపించు! అయ్యగారికి పేంటింగులు కావాలేమో కనుక్కో!... అరే, నాథా! నీకు బొత్తిగా బుద్ధి లేదురా! కస్టమర్స్ వస్తే హుషారుగా ఉండాలని తెలీదా!" అంటూ సేల్స్‌మన్‌ని కసిరి తానే స్వరాహ్ బీరువాల వద్దకు వచ్చి చీరలు తీసి బయట పడెయ్యటం ఆరంభించేసు సేట్ సుందర్‌లాల్.

"ప్రస్తుతం పేంటింగులు వద్దు. చీరలు మాత్రం చూపించండి!" అంటూ సీత వైపు తిరిగి "సీతా! నీకు సిల్కు చీరలు చాలా ఉన్నాయి కదా మంచి కాటన్ చీరలు తీసుకో!" అన్నాను. సీత నావంక నిరసనగా చూసింది.

నా పరువు కాపాడమన్నట్లు కళ్ళతోనే అర్థించాను.

"ఫుల్‌వాయిల్స్ చూపించండి. లేత రంగులు మాత్రమే కావాలి. గడి లేకుండా చిన్న పువ్వుంటే మరీ మంచిది. 'బార్డరు పెద్దదిగా ఉండాలి'" అంటూ తనకు కావలసిన చీర ఎలా ఉండాలో వర్ణించింది మా ఆవిడ.

"అలాగేనండీ!" అంటూ సిల్కు చీరలన్నీ ఒక వారకు తోసేసి ఫుల్‌వాయిల్ చీరలు సుమారు పదిహేను తీసి కౌంటరు మీద పరిచినట్లు పడేశాడు సేల్స్‌మన్.

సీత చీరనూ, బార్డరునూ తడిమి చూస్తూ ఎంపికలో మునిగి పోయింది.

సుందర్‌లాల్ నాతో కబుర్లు చెప్తున్నాడు.

నా ఉద్యోగం గురించి తలా తోకా లేని ప్రశ్నలు వేసి నా సమాధానాలన్నిటికీ నవ్వుతున్నాడు. నేను అమెరికన్ కంపెనీలో పని చేస్తున్నానని అతనికి తెలుసు. అమెరికన్ కంపెనీలో పని చేసేవాళ్ళందరూ ఆఫీసర్లే అని అతని నమ్మకం కాబోలు. నేను ఒక మామూలు గుమాస్తానే అని అతనికి తెలీదు. అయినా అతడిస్తున్న గౌరవాన్ని వదులుకోవటం నాకూ ఇష్టం లేదు.

అంతలోనే ఒక కుర్రాడు డ్రింక్స్ తెచ్చాడు.

"తీసుకోండి!" అంటూ నాకొకటి, మా శ్రీమతి కొకటీ అందించాడు.

"ఇప్పుడివన్నీ ఎందుకు?" అంటూ మొగమాటం ప్రకటిస్తూ సీసా అందుకున్నాను. సీత మాత్రం మారుమాట్లాడకుండా డ్రింక్ తాగి సీసా కుర్రాడికి అందించి చీరల సెలక్షన్‌లో మునిగిపోయింది.

అయిదు నిముషాల తర్వాత ఒక చీర ఎంపిక చేసింది.

"ఇదెంత?"

"తొంభయి రెండు రూపాయలు" అన్నాడు సేల్స్‌మన్.

"అబ్బా, చాలా ఎక్కువే!" అంది సీత.

"సీతా, నీకా చీర నచ్చితే తీసుకో! ఖరీదు గురించి ఆలోచించకు. సేట్ మనకు తెలిసినాయనే! ఖరీదులు జాగ్రత్తగానే వేస్తాడు" అంటూ సేట్ వంక చూసి చిన్నగా నవ్వాను.

"కావాలంటే ఫ్రీగా తీసుకు వెళ్ళండి సార్. మీలాంటి కస్టమర్స్ మాకు ఎలా దొరుకుతారు?" అంటూ పళ్ళన్నీ బయటకు పెట్టి వికృతంగా నవ్వాడు.

"ఇంకేమైనా చీరలు చూపమంటారా?" సెలెక్టు చేసిన చీర మడత పెడుతూ అడిగాడు సేల్స్‌మన్.

"ప్రస్తుతానికి మరేమీ వద్దు. మళ్ళీ పండుగ ముందు వస్తాం" అంటూ సీత ఇంకా చీరలు కావాలంటుందేమోనన్న భయంతో ముందే అడ్డుకట్ట వేశాను.

సేల్స్‌మన్ చీరను కవరులో ఉంచి పేక్ చేసి అందించాడు.

జేబులో ఉన్న ఒకే ఒక వంద రూపాయల నోటుని విసురుగా గల్లా పెట్టె మీద పడేశాను. సుందర్‌లాల్ బిల్లు రాసి ఎనిమిది రూపాయ నోట్లు, బిల్లు కలిపి నాకు అందజేశాడు. మేం బయటకు వచ్చేస్తూ ఉంటే సవినయంగా నమస్కరించి "మమ్మల్ని మరచిపోకండి" అన్నాడు.

బయట ఎండ విపరీతంగా ఉంది. మధ్యాహ్నపు సూర్యుడు నెత్తి మాడ్చేస్తున్నాడు.

"దారుణం!" అంది సీత నా పక్కగా నడుస్తూ.

"ఎండనా? నిజమే దారుణంగా ఉంది" అన్నాను చెమట తుడుచుకుంటూ.

"ఎండ కాదు, చీరఖరీదు! మొన్న మన పక్కింటి కామేశ్వరమ్మగారు ఇదే చీర డెబ్బయి అయిదు రూపాయలకు కొన్నారు. పదిహేడు రూపాయలు ఎక్కువ వేశాడు మనకు!" అంది సీత ముఖం చిట్లిస్తూ.

"ఛ! ఛ! సుందర్‌లాల్ అలాంటివాడు కాదు.

పైగా నాకు తెలిసినవాడే" అన్నాను.

"తెలిసినవాడు కనుకనే మరి మాట్లాడలేక పోయాం" అంది.

"అయినా, కామేశ్వరమ్మగారు కొన్న చీర నేనే రకం అయి ఉంటుంది. పుల్‌వాయిల్‌లో బోలెడు రకాలుంటాయి. . ." అంటూ చీరల్లోని రకాల గురించీ, తరతమ భేదాల గురించీ వర్ణించ బోయాను.

"చాల్లెండి. చీరల గురించి మీకే తెలుసు— కట్టుకునేదాన్ని నాకు తెలియదు కాబోలు!" అంటూ మరి నన్ను మాట్లాడనీయకుండా చేసేసింది సీత.

"బాబూ! రిక్షా కావాలా?" పిలుపు విని పక్కకు చూశాను.

మొహం మీద నుంచి కారిపోతున్న జిడ్డులాటి చెమటను పై మీద ఉత్తరీయంతో ఒత్తుకుంటూ ఆయాసంతో రొప్పుతూ అడిగాడు రిక్షావాడు.

వాడి ముఖం నిండా వికృతంగా గుంటలు!

అతడు నాకు తెలిసినవాడే!

మేముంటున్న కాలనీ వెనుకే గుడిసెలో ఉంటున్నాడు.

"బాబూ! ఇంటికేనా? ఎక్కండి, తీసుకు పోతా" అన్నాడు.

"సీతా! రిక్షా మీద వెళ్ళిపోదాం, ఎక్కు!" అన్నాను.

"తీరా రిక్షా దిగాక అర్ధరూపాయి అడుగుతాడేమో! మూడో, నాలుగో ఇమ్మంటే కష్టం. రెండు రూపాయలకు బేరం ఆడండి." మెల్లగా రహస్యం చెబుతున్నట్లు అంది సీత.

"ఫర్వాలేదు, ఈ రిక్షావాడు తెలిసినవాడే. మన కాలనీ వెనుకే ఉంటున్నాడు" అన్నాను మెల్లగా.

"మీకందరూ తెలిసినవాళ్ళే!" అని గొణుగుతూ రిక్షా ఎక్కింది సీత. పక్కనే సర్దుకుని కూర్చున్నాను.

రిక్షావాడు హైరాన పడుతూ తొక్కుతున్నాడు. రెండు ఫర్లాంగులు వెళ్ళే సరికి వాడి బనీనంతా చెమటతో తడిసి ముద్దయిపోయింది. ఆయాసంతో రొప్పటం కూడా స్పష్టంగా వినిపిస్తోంది. దీనికి తోడు పైన నెత్తిని మాడ్చే ఎండ!

సీతతో కబుర్లు చెప్తున్నాను.

చీరలో పన్నిపోయిన పదిహేను రూపాయల గురించి గొణుగుతూనే ఉంది సీత.

సుమారు ఇరవై నిముషాలు గడిచాక కాలనీలో మా ఇంటి ముందు రిక్షా ఆగింది.

కిందకు దిగి రిక్షావాడి చేతిలో రూపాయి నోటు ఉంచాను.

"బాబూ! అయిదు మైళ్ళ దూరానికి రూపాయి డబ్బులా?" ఒగరుస్తూ అడిగాడు.

"ఇంకెవరికయినా అయితే మూడిచ్చేవాణ్ణి. 'నువ్వు తెలిసినవాడివి కదా' అని రూపాయిచ్చాను." అంటూ వాడి సమాధానానికి ఎదురు చూడకుండా "పద సీతా!" అంటూ ఇంట్లోకి దారి తీశాను.

"తెలిసున్నవోరు కదా" అని బేరం ఆడకుండా బాడుగ కట్టటం వాడే పొరపాటు బాబూ!" రిక్షా నడిపించుకుని ముందుకు సాగిపోతూ వాడు గొణుక్కోవటం స్పష్టంగా విన్పించింది నాకు. ★


# ఆంధ్రప్రభ
## సచిత్ర వారపత్రిక

## ఉగాది నవలల పోటీ

రౌద్రి ఉగాది సందర్భంగా ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక నవలల పోటీ నిర్వహిస్తున్నది. నవలల ఎన్నికలో ఎప్పుడూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికదే అగ్రతాంబూలం అని పాఠకులకు తెలుసు. మంచి నవలలను మాత్రమే ఎన్నిక చేసి, ఉత్తమ రచయితలను, రచయిత్రులను ప్రోత్సహించడం మా సంప్రదాయం. ఈసారి కూడా ప్రముఖ రచయితలు, రచయిత్రులు, కొత్తవారు ఇతోధికంగా పోటీలో పాల్గొనగలరని ఆశిస్తున్నాం.

**మొదటి బహుమతి రు. 5,000**
**రెండవ బహుమతి రు. 3,000**
**మూడవ బహుమతి రు. 2,000**

నిబంధనలు :

★ నవల అర రావు సైజు కాగితాలలో 250 పుటలు ఉండాలి.
★ సిరాతో కాగితానికి ఒక ప్రక్కనే రాయాలి.
★ నవలా వస్తువు తెలుగువారి జీవితానికి సంబంధించినదై ఉండాలి.
★ అనువాదాలు, అనుసరణలు పోటీకి పనికిరావు.
★ కవరు పైన 'ఉగాది నవలల పోటీ'కి అని స్పష్టంగా రాయాలి.
★ బహుమతి పొందని నవలల్లో యోగ్యమైనవి వారపత్రికలో మామూలుగా ప్రచురించుకునే హక్కు మాకు ఉన్నది.
★ ప్రచురణకు స్వీకరించని నవలలు తిప్పిపంపే నిమిత్తం తగినంత పోస్టేజి అంటించిన, అడ్రసు ఉన్న కవరు నవలతో జత పరచవలసి ఉంది. లేకపోతే తిప్పి పంపడం సాధ్యం కాదు.
★ ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.
★ కలం పేరు ఉపయోగించే వారు అసలు పేరు, పూర్తి చిరునామా హామీ పత్రంతో ఇవ్వాలి.
★ నవలలు "ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక, దోమల్‌గూడ, హైదరాబాదు—500029" అడ్రసుకు పంపవలసి ఉంది.

నవలలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ :

**31 డిసెంబరు, 1979**